# రూట్స్

మెయిన్ రోడ్డులో బస్సు దిగాను. చేతిలో చిన్న సంచి మాత్రం ఉంది. దానిలో కొన్ని పండ్లు, మిఠాయిలు ఉన్నాయి. పండ్లు మా ఊరి బస్టాండులో కొన్నా మిఠాయి మాత్రం ఢిల్లీది. ఎన్నో ఏళ్ళ తర్వాత శాంతమ్మత్తగారి ఊరు వెళ్తున్నాను. అది చిన్న పల్లెటూరు. మా ఊరికి నలభై మైళ్ల దూరంలో ఉంటుంది. మెయిన్ రోడ్డునుండి మూడు మైళ్ల నడక లేదా ఎద్దుల బండి. ఆ ఊరికి రోజూ వచ్చిపోయే జనమంతగా ఉండరుగనుక బాడుగ బండిని వెతికి లాభంలేదు. ముందుగా నేను వస్తానని ఎవరికీ తెలీదుగనుక ఎడ్లబండి కోసం ఎదురు చూసే పనీలేదు. కానీ పొలాల మధ్య నడిచేస్తే పెద్ద దూరమనిపించదు.

మొదట సజ్జచేను. కంకులు బాగా గింజపట్టి ఉన్నాయి. బ్యాగ్ భుజానికి తగిలించుకొని కాస్త శ్రమపడి పాలకంకి ఒకటి విరిచాను. పసితనం జ్ఞాపకం వచ్చింది. ఆ రోజుల్లో ఆబగా పళ్లతో గింజలు కొరుకుతూ మింగుతుండేవాళ్ళం. అమ్మమ్మ కోప్పడుతుండేది. కడుపునొప్పి వచ్చేను అనేది. అవి కాస్త కాల్చుకుతినరాదా అనేది. పిల్లలం పొలాల దగ్గరకు వెళ్తే మాకు విఐపి ట్రీట్‌మెంట్ దొరికేది. మా కోసం వేరుశనక్కాయలు కాల్చి పెట్టేవాళ్ళు. లేత కంకులు కోసి పెట్టేవాళ్ళు, కాపలా కోసం గడ్డికప్పిన చిన్న టెంట్‌లాంటి గుడిసెలో ఇసుక మీద కూర్చుని ఇవన్నీ రుచులు చూస్తుంటే భలేగా ఉండేది.

శాంతమ్మత్త వాళ్ళ ఊరికి నేనురావటం ఇది మూడోసారి. ఎనిమిది తొమ్మిదేళ్ల వయసులో రవి, సుధలతో వచ్చి ఇక్కడే వారం పదిరోజులు గడిపాను. అపుడు దిగుడుబావి

లోతుకు అబ్బురపోయాను. నాకు నీళ్ళంటే భయం మొర్రో అంటున్నా వినకుండా నీళ్లలోకి దింపిన పెదబాబు, నాకు కొద్దికొద్దిగా ఈత నేర్పిన సీతారాం. అదంతా గొప్ప అనుభవం. పొలాల వెంబడి తిరుగుతూ, చేతికి దొరికిందంతా విరిచేస్తూ, వేరుశనగ మొక్కలు లాగేస్తూ, నారింజ తోటలో పళ్ళుకోసుకొంటూ, పళ్ళు పులుస్తున్నా తొనలు చప్పరిస్తూ, బొమ్మజెముడు పొదల్లో, ఇంకేవేవో ముళ్ళపొదల్లో వెర్రిమొర్రి కాయలు వెతుకుతూ సాహస యాత్రలు ఎన్నో చేసి ఇంటికి వచ్చేవాళ్లం. ఒక్కరికీ అన్నం సొక్కేదికాదు. కానీ చిరుతిళ్లకు ఎగబడేవాళ్లం. శాంతమ్మత్త వంటలు బాగా చేసేది. అతి రసాలు, పోళీలు, నూగుండలు, జేబుల్లో పోసుకుని బొక్కటానికి మురుకులు, వేయించిన శనగపప్పు, కారం పెట్టిన వేరుశనగ్గింజలు వగైరా.

ఆ తర్వాత సుధ పెళ్ళికి వెళ్లాను. అప్పుడు నేను ఇంటర్మీడియట్ ఫస్టియర్. సుధకు పదో తరగతితోనే చదువు ముగిసింది. వెంటనే పెళ్లి జరిగింది.

ఇప్పుడు మూడోసారి ఇరవై ఏళ్ల తర్వాత ఆ ఊరు వెళ్తున్నాను పాత జ్ఞాపకాలు తవ్వుకుంటూ. చదువు, ఉద్యోగాలు, పై చదువులు, పై ఉద్యోగాలలో పడి 'రూట్స్' మరిచిపొయ్యే ప్రమాదముందనిపించింది. ఇరవై ఏళ్ళపైగా పట్టణ వాసం. ఎప్పుడైనా సెలవులకు వచ్చినా మా ఊరు పట్టణమవుతోందని సంబరపడ్డానేగానీ తన ప్రత్యేకత పోగొట్టుకుంటోందని అనుకోలేదు.

నా ఉద్యోగరీత్యా గ్రామాల గురించి, గ్రామాభివృద్ధి గురించి, డెవలప్‌మెంట్ కమ్యూనికేషన్ గురించి వీళ్ళూ వాళ్ళూ వ్రాసిన ప్రాజెక్టులు పరిశీలించి సెమినార్లలో, కాన్ఫరెన్సులలో పాల్గొంటూ ఉంటాను. ఒక ఊళ్ళో ఎన్ని టి.వీ లు ఉన్నాయి. ఎన్ని రేడియోలున్నాయి. ఎన్ని న్యూస్ పేపర్లు వస్తాయి. రైతులు ఏ పంటలు పండిస్తున్నారు. ఏ ఎరువులు వాడుతున్నారు. సరైన రోడ్లున్నాయా, బస్సులున్నాయా అనే వాటిని బట్టి ఒక గ్రామం ఆధునికమైందా లేదా అని చెప్పగలిగే నేను పట్టుమని పదిరోజులు కూడా ఏ గ్రామంలోనూ వాళ్లలో ఒకనిగా మెలగలేదు. అందుకే నిర్ణయించుకొన్నాను. ఈ సారి ఊరికి వెళ్ళినప్పుడు ఒక పల్లెటూరికి తప్పక వెళ్ళాలని. పై అధికారిగానో లేక ఏ కప్పనో, కాక్రోచ్‌నో డిసెక్ట్ చేసే జువాలజీ స్టూడెంటుగానో కాకుండా పల్లెవాళ్లలో ఒకడినై ఊరు పరిశీలించాలనుకొన్నాను. అప్పుడే శాంతమ్మత్తవాళ్ల ఊరు జ్ఞాపకం వచ్చింది.

వాళ్ళందరినీ చూసి కూడా చాలా రోజులైంది. ఇంతదూరం నుంచి వాళ్లని చూడడానికి వెళ్ళానంటే వాళ్ళెంతో సంతోషిస్తారు. నేను బస్సు దిగేసరికే సాయం కాలమైంది. సూర్యుడు అస్తమిస్తున్నాడు ఎర్రగా. పొలాలన్నీ ఆ ఎండలో తళతళలాడుతున్నాయి. మా ఊరిచుట్టూ చిన్నచిన్న కొండలున్నాయి. సూర్యోదయం, సూర్యాస్తమయం కొండలచాటున జరగటం చూసేవాడిని. కాబట్టి సూర్యుడు పుట్టినా, కుంకినా కొండ లాధారంగానే జరగాలనుకునేవాడిని చిన్నప్పుడు. నేను వేసే డ్రాయింగ్‌లలో విధిగా రెండు కొండల మధ్యన ఓ సూర్యుడు ఉండేవాడు.

ఈ ఆలోచనలతో మూడు మైళ్ళూ ఎప్పుడు నడిచానో తెలీదు. సంజ చీకటి వేళకు ఊళ్లో అడుగుబెట్టాను. అప్పుడే వీధిదీపాలు వెలిగాయి. అవును ఇక్కడకూడా ఎలక్ట్రిసిటీ వచ్చింది. దారిలో అక్కడక్కడా బావులవద్ద ఇంజన్లు కూడా గమనించాను. పాతకాలంలా గంటలకొద్దీ ఎడ్ల సాయంతో మోట వేసి నీళ్ళు తోడే అవసరం లేదు. ఊరు అంతగా మారలేదు కానీ మార్పు కనిపిస్తోంది. ఊరి బయట గంగమ్మ గుడిచుట్టూ ఇటుకగోడ వెలిసింది. చాలావరకు పూరి గుడిసెలు మాయమయ్యాయి.

మరో పదడుగులు వేసేసరికి శాంతమ్మత్తవాళ్ళ ఇల్లు రానేవచ్చింది. ఇక్కడేం మార్పులేదు. సున్నంగొట్టిన మట్టి గోడ కాంపౌండు వాల్‌లా. లోపల చాలా ఖాళీ స్థలం. ఎడమవైపు పశువులుకట్టే స్థలం. కుడివైపుగా ఇల్లు. కాస్త దూరంగా గడ్డివాములు, వేప చెట్టు... అంతా ముందులాగే ఉంది.

వరండా స్తంభాల చుట్టూ పిల్లలు కేరింతలు కొడ్తూ గెంతుతున్నారు. నులక మంచంమీద కూర్చున్నది ఎవరు? చిన్న మామా లేక పెదబాబా?

ఇంతలో భౌయ్‌మని కుక్క మొరిగింది. మంచం మీద నుంచి పెదబాబు, అవును పెదబాబే లేచాడు. "ఎవరూ" అంటూ.

"నేను... పార్థును"

ఇంతలో చిన్న మామ లోపల నుండి వచ్చాడు. "అరె పార్థూ , రా అప్పారా, దారి మరిచిపోయి వస్తివా?"

"లేదు మామా, అదేం మాట."

పెదబాబు "దా పార్థా దా. కూర్చో" అని మంచంమీద స్థలం చూపించాడు. "పాపా సరోజా, మీ చిన్నవ్వకు చెప్పమ్మా చిన్నాయన వచ్చాడు ఢిల్లీ నుంచి అని."

అప్పటికే శాంతమ్మత్త ఆ మూలనున్న వంటింట్లోంచి వచ్చింది. మనిషి బాగా వడలిపోయింది. జుట్టు నెరిసింది. "ఏమప్పా పార్థా, ఇన్నాళ్లకు జ్ఞాపకమొచ్చామా? నువ్వు వచ్చావని వింటాం. మనూరికి వెళ్ళి చూద్దామనుకునే లోపలే వెళ్ళిపోయావని వింటాం. ఒకసారైనా అత్తను చూడాలని రాలేకపొయ్యావా?" నిష్టూరంగా మాట్లాడుతూనే చేతికి కాఫీ గ్లాసందించింది. అది స్టీలుగ్లాసు, ఆ రోజుల్లో మేమంతా ఇత్తడి గ్లాసుల్లో కాఫీ తాగే వాళ్ళం. అదీ బెల్లంతో కాచిన కాఫీ. చిన్న పిల్లలం మరింత కొసరికొసరి పోయించుకునేవాళ్లం.

ఇప్పుడు రుచులు మారాయి. కానీ ఆప్యాయంగా ఇచ్చిన ఆ తియ్యటి కాఫీని వదిలిపెట్టే సాహసం చెయ్యలేకపోయాను.

"నీ కోసం చక్కెర కాఫీ చేశాలే" అంది అత్త.

అసలు శాంతమ్మత్తకూ మాకూ చుట్టరికమేమీ లేదు. మా చిన్నప్పుడు శాంతమ్మత్తా వాళ్ళు మా పెంకుటింట్లో అద్దెకు ఉండేవారు. వాళ్లది మరీ పల్లెటూరైనందున పిల్లల చదువుకని ఈ ఊరొచ్చింది. చిన్నమామ ఎప్పుడైనా వచ్చిపోతుండేవాడు. బియ్యం, పప్పులు, ఇంకా ఏవేవో తెచ్చి పడేస్తుండేవాడు. వాళ్లది పెద్ద సంసారం. పెద్ద వ్యవసాయం. ముగ్గురన్నదమ్ములు కలిసి ఉండేవారు. పిల్లలంతా చదువుకని ఈ ఊరొచ్చారు. పది పన్నెండేళ్ల తర్వాత ఎవరి దారి వాళ్లదైంది. శాంతమ్మత్త మకాం పల్లెకి మార్చేసింది. కానీ మా సంబంధాలు మాత్రం అలాగే ఉన్నాయి.

ఆ రాత్రి ఒక సంబరమే అయింది. చిన్నమామ, పెద్దమామ, కొడుకులు, కోడళ్ళు, పిల్లలు అందరితో ఇల్లంతా గలగలా అని ఉంది. మనం పట్టణాల్లో కోరుకునే ప్రైవసీలు ఇక్కడెవరికీ అవసరం లేనట్టే ఉంది. భోజనాలు త్వరగానే అయ్యాయి. ఆ తర్వాత ఈ కబుర్లూ, ఆ కబుర్లూను.

"ఇంకా టీవీ తీసుకురాలేదా?" అన్నాను.

"వాటివల్ల ఏం ప్రయోజనం? ఇప్పుడు లేకపోతే ఏమి నష్టమొచ్చింది" అన్నాడు పెదబాబు.

కాస్సేపు మౌనం.

"ఇప్పుడు అందరూ కొంటున్నారులే అన్నా" అన్నాడు చిన్నమామ.

"ఈ ఊళ్లోకల్లా ఒకరింట్లోనే ఉంది టీవీ. దానిలో బొమ్మ సరిగా కనిపించదు. ఒకవేళ కనిపించినా కన్నడమో, అరవమో వినాల్సిందేగానీ తెలుగు ప్రోగ్రాములు రావు" అన్నాడు సీతారాం.

"హిందీ మనకు అర్థమయ్యేది తక్కువగదా" అన్నాడు పెదమామ.

దీనితో దేశవ్యాప్తంగా టీవీ ప్రసారం ఉంది అనే మాట ఎంత సత్యమో తేలిపోయింది. కనిపించని బొమ్మ, అర్థంకాని భాష - ఇక కమ్యూనికేషన్ గురించి చెప్పేదేముంది?

రాత్రి నాకు ఒక్కడికే, మంచం మీద పరుపువేశారు. తక్కిన వాళ్లు కిందే, హాల్లో, వరండాలో, గదుల్లో పరుపులు పరుచుకొన్నారు. రాత్రి తొమ్మిది దాటింది. అప్పటికే ఊరంతా నిద్రపోయినట్లుంది. ఏ శబ్దాలూ లేవు. అడపాదడపా ఏదో కుక్క మొరుగుతోంది.

వంటింటివైపు నుండి పెద్దత్త, శాంతమ్మత్తల మాటలు సన్నగా వినిపిస్తున్నాయి. ఇప్పటికీ వీళ్ల పనులు ముగిసినట్టులేదు. పాపం రోజంతా చేసినా తీరే పనులు కావవి.

ఇంతలో గుండెలదరగొడ్తూ కెవ్వున కేక వినిపించింది. ఎవరో అరుస్తున్నారు. ఏడుస్తున్నారు. నేను ఒక్క ఉదుటున ఆ వైపుగా పరుగెత్తాను. చీకట్లో దారి తెలీక దేనికో కాలుతగిలింది. ప్రాణం జివ్వుమంది. పెదబాబు ఏదో గొణుగుతున్నాడు. నా వెంట సీతారాం రావడం గమనించాను.

"ఏందమ్మా ఈ రామాయణం. పార్థు చూడు ఎలా హడలిపోయాడో" అని పెద్దత్తను దండించాడు.

శాంతమ్మత్త, పెద్దత్త వంటింటి తలుపువద్ద నిలబడ్డారు. తలుపు దగ్గరగా వేసుంది. లోపలనుంచి వెక్కిళ్ళు వినిపిస్తున్నాయి.

"ఏమీ లేదులే పార్థూ. ఏదో మా నాటు వైద్యం" అంది శాంతమ్మత్త తలుపు తెరుస్తూ.

లోపల చిమ్మచీకటి. పెద్దత్తలైటు వేసింది. సరోజ నేలమీద పడి ఏడుస్తోంది. దాని జుట్టు నేలమీద పొర్లాడుతోంది. ఆ పక్కనే పీట, పీట ముందు విస్తరి. విస్తరిలో కుప్పగా అన్నం. దాని చుట్టూ పసుపు కుంకుమ, మధ్యలో నిమ్మకాయ. నాకేం అర్థంకాలేదు. శాంతమ్మత్త సరోజను పైకి లేవదీసింది. దాని మొహంమీద పెద్ద బొట్టు కనిపించింది.

"ఏమత్తా ఇది" అన్నాను. సరోజను పడుకోబెట్టి వచ్చింది పెద్దత్త.

"దీనికీ మధ్య ఏదో గాలిసోకింది పార్థూ. విపరీతమైన ఆకలి. ఎంత తిన్నా ఆకలి తీరదు. పైగా అరిగించుకోదు. ఎప్పుడూ నచ్చుగా ఉంటుంది. మంత్రాలశానప్ప నిమ్మకాయ మంత్రించి ఇచ్చాడు. రాత్రిపూట ఒంటరిగా అన్నంముందు కూర్చోబెట్టే సోకిన గాలి పోతుందన్నాడు. ఐదు రాత్రిళ్ళు చేస్తే చాలట. ఇది మూడోరాత్రి. ఇదేమో అరిచి యాగీ చేస్తుంది. మరి ఒళ్ళు బాగయ్యేదెట్లా?"

నాకు చాలా కోపం వచ్చింది. ఏం మాట్లాడకుండా వెళ్ళి పడుకున్నాను. రాత్రంతా ఆలోచిస్తూనే ఉన్నాను. అభివృద్ధిని గురించి, ఆధునికత గురించి నా థియెరీలు, తక్కిన వాళ్ల ప్రాజెక్టులు, మరెన్నో చర్చలూ వ్యర్థమనిపించింది. ఇదేమీ ఆదిమవాసుల స్థానంకాదు. శాంతమ్మత్తా వాళ్ళు నాగరిక ప్రపంచం తెలీనివాళ్ళూకాదు. కానీ పిల్లకు విపరీతంగా ఆకలి వెయ్యటం రోగలక్షణమని డాక్టరుకు చూపించాలని వాళ్ళకెందుకు తోచలేదు? చీకటిలో ఒంటరిగా అన్నం ముందు కుదేస్తే ఆ షాక్ ఒక పట్టాన తీరేనా? ముందుముందు తన జీవితానికది ఎంత శాపమవుతుందో వీళ్ళు గ్రహించలేదా?

మరునాడు నేను ఊరికి బయలుదేరుతుంటే "అప్పుడేనా పార్థూ" అంది శాంతమ్మత్త.

"వెళ్తానత్తా. ఇంటి దగ్గర కూడా కొన్ని పనులున్నాయి. అన్నట్లు, సరోజను నాతో పంపించు. అక్కడ కొన్నాళ్ళు ఉండివస్తుంది."

"ఇప్పుడొద్దులే. ఇంకెప్పుడైనా..." అంది పెద్దత్త.

"లేదు. ఇప్పుడే తీసుకెళ్తాను. నేనున్న పదిరోజులూ ఉండివస్తుంది" తనని ఎంత త్వరగా డాక్టర్ వద్దకు తీసుకెళ్ళాలా అని నా తాపత్రయం.

"పోనీలే పంపించమ్మా" అన్నాడు సీతారాం.

"దానికి ఇప్పుడు..."

"మరేం ఫర్వాలేదు పంపించు. పద పార్థూ, బస్సు దాకా నేనూ వస్తాను. రెండు మూడు రోజుల్లో ఊరికి వస్తానులే. అమ్మను చూసి చాలా రోజులైంది" అన్నాడు సీతారాం.

నేను సరోజవైపు చూశాను. ఆ పసికళ్ళలో మెరుపు కనిపించింది. పెదవులపై నవ్వు విరిసింది.

*(25 నవంబరు 1990)*